ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
8
బుధవారం 18 డిసెంబరు 2024



“ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులు సమ్మెబాట పట్టారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చలో హైదరాబాద్ పిలుపుతో మహాధర్నా తలపెట్టారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా జీపీ కార్మి కులు విధులు బహిష్కరించి మండల కేంద్రాల్లో దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ నెల 20వ తేదీ తర్వాత ఏ రోజు నుంచైనా నిరవధిక సమ్మెకు కార్యాచరణ రూపొం దించారు.

పంచాయతీ కార్మికుల పోరుబాట


పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థల పాలన అత్యంత కీలకమైంది. ఇందులోనూ గ్రామపంచాయతీల పాలన ప్రధానం. కాగా పంచాయతీల పురోభివృద్ధిలో వెన్నెముకగా నిలుస్తునన కార్మికులు కనీస వేతనాల కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇతర విభాగాల్లో కార్మికులకు కల్పిస్తున్న కనీస హక్కులు కూడా తమకు లేవని వేతనాల విషయంలోనూ చిన్న చూపే ఎదురవుతోందని పంచాయతీ కార్మికులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అందోళన బాట పట్టిన కార్మికులు మరోసారి సమ్మెకు సిద్ధమయ్యారు.

• డిమాండ్లు ఇవి..

- గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలి.
- రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకువచ్చి జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలి.
- ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ. 5లక్షలు చెల్లించాలి.
- ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు, కారుణ్య నియామకాలు చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.
- మల్టీపర్పస్ పదాన్ని తొలగించాలి.
- ఇప్పుడు ఇస్తున్న వేతనం సరిపోవడం లేదు. కనీస వేతనం రూ. 19,600 ఇవ్వాలి.
- రెండు నెలలకు ఒకసారి సబ్బులు, గ్లౌజులు అందించి, వారాంతపు సెలవులు మంజూరు చేయాలి.
- ప్రమాద బీమా రూ. 10లక్షలు, ఆరోగ్య, గుర్తింపు కార్డులు, ఏటా రెండు జతల దుస్తులు అందించాలి.

జిల్లాలో 335 పంచాయతీల్లో..

జిల్లాలో ఉన్న 335 గ్రామపంచాయతీలలో జనాభా ప్రతిపాదికన 685 మంది మల్టీపర్పస్ వర్క ర్లను గత ప్రభుత్వం నియమించింది. వీరిలో పారిశుధ్య కార్మికులు, స్వీపర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు తదితర కేటగిరలలో పని చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం, నర్సరీల్లో మొక్కలు పెంచడం, పార్కుల నిర్వహణ, ఆఫీసు నిర్వహణ విధుల్లో కొనసాగుతున్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి పనులన్నీ కార్మికులు చేస్తుంటారు.

- వేతనాలు పెంచుతూ పర్మినెంట్ చేయాలని డిమాండ్
- 9 అంశాలతో ప్రభుత్వానికి నోటీసు
- 20 తర్వాత సమ్మెలోకి కార్మికులు

● మల్టీపర్పస్ వర్కర్ల పేరుతో..

మల్టీపర్పస్ వర్కర్ల పేరుతో కార్మికులను నియమించిన నాటి ప్రభుత్వం పంచాయతీల్లో ఏ పనైనా చేయాలని ఆదేశించింది. వీధుల్లో చెత్త తొలగించడం మొదలు ఇంటింటికి వెళ్లి సేకరించడం ఇతర పనులు చేయాల్సి రావడంతో పని ఒత్తిడికి గురవుతున్నామని కార్మికులు వాపోతున్నారు. కాగా కార్మికులకు సంబంధం లేని పనులు కూడా చేయించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పంచాయతీల్లో ట్రాక్టర్లు నడిపేందుకు నైపుణ్యం కలిగిన డ్రైవర్లను నియమించాలి. కానీ ఈ వర్కర్లలో ఒకరికే ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు పూరమాయించడంతో పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వీధి దీపాల నిర్వహణలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ఇంత చేస్తున్నా కనీస వేతన హక్కు చట్టాన్ని తమకు వర్తింపజేయడంలేదని చెబుతున్నారు. తమకు వచ్చే అరకొర వేతనంతో కుటుంబాల పోషణకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

● హామీల అమలు కోరుతూ..

ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పంచాయతీ కార్మికులు ఇప్పటికే ఆందోళన బాట పట్టారు. వారికి మద్దతుగా కార్మిక సంఘాలన్ని జేఏసీగా ఏర్పడి ఉద్యమాలకు సమాయత్తమయ్యారు. ప్రధానంగా కార్మికులకు సంబంధించి తొమ్మిది డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించారు. వాటిని పరిష్కరించకుంటే సమ్మె తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ధర్నాలు చేశారు. ప్రభుత్వం స్పందించడం లేదని, దీన్ని నిరసిస్తూ మంగళవారం హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఏరోజైనా సమ్మెకు వెళ్లెందుకు సన్నద్ధమవుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

- మోరేశ్వర్, జీపీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు



గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటికే ఆందోళనలు చేశాం. ప్రభుత్వం నుంచి స్పందన లేనందున తొమ్మిది డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చాం. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే 20వ తేదీ నుంచి సమ్మె చేపడుతాం.

● సమాచారం

రేపు మినీ జాబ్‌మేళా

ఆసిఫాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్ కేంద్రంలో గురువారం జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యవతకు మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడిప్లస్ కరీంనగర్ సంస్థ ఆధ్వర్యంలో మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల్లో పని చేసేందుకు 40 ఫార్మాసిస్టు పోస్టులు, 50 కస్టమర్ సపోర్ట్ అసోసియేట్, 100 జూనియర్ అసిస్టెంట్, 30 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులకు ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నామని తెలిపారు. అభ్యర్థులు 18-30 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9440514962, 9502786438 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మైనార్టీ మహిళలకు అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమాధికారిణి రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల మహిళలు ఈనెల 31 లోగా www.tgobmms.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన ప్రతులను జిల్లా మైనార్టీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించినా సిబ్బంది తెలియజేస్తారని రమాదేవి తెలిపారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ఇంటింట సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలంలోని అంకుశాపూర్ గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను ఇందిరమ్మ ఇళ్ల కోసం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాని చెప్పారు. వివరాలను ఇందిరమ్మ యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరి వివరాలు తప్పని సరిగా నమోదు చేయలన్నారు. సర్వేకు 500 ఇళ్లకు ఒక అధికారిని నియమించామని తెలిపారు. సర్వే ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: ఇందిరమ్మ ఇల్ల సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి సేకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. సర్వేలో సేకరించిన అంశాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడు తూ సర్వేను పక్కాగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో రహదారి భద్రత కమిటీ సమావేశానికి మంగళవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనవాస్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులు, కల్వర్టులు, వంతెనల వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చి వేయాలని చెప్పారు. అనుబంధ రహదారుల వద్ద వేగ నియంత్రణ చర్యలను చేపట్టాలన్నారు. స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేసి మద్యం సేవించి వాహనాలు నడుపకుండా తనిఖీలు చేపట్టాల న్నారు. రహదారులను అనుకొని ఉన్న జిన్నింగ్ మిల్లుల వద్ద ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది 139 ప్రమాదాలు జరిగాయని, ఈ ఏడాది నవంబరు వరకు 133 ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో పీఆర్‌ఈఈ ప్రభాకర్, ఆర్‌అండ్‌బీ ఈఈ శైలేందర్, డీటీవో రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని 105 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ. 6.89 కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్లు, ఇతర వ్యాపారాలలో అభివృద్ధి చేందేందుకు రుణసదుపాయం కల్పించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్డీవో దత్తరాం, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్‌జోషి, ఏపీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు రైతుల నిరీక్షణ

సిర్పూరు(టి), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు(టి) మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోళ్లకు రైతులు నిరీక్షిస్తున్నారు. ఒకే సారి పెద్ద సంఖ్యలో రైతులు రావడంతో పత్తి లోడ్‌లకు నంబర్ కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొన్నంది. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి సిర్పూరు(టి), కౌటాల, బెజ్జూరు, చింతలమానేపల్లి, కాగజ్‌నగర్, చింతకుంట, తదితర మండలాల నుంచి రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. రోజుకు 50 నుంచి 100 కూపన్లు మాత్రమే అధికారులు ఇవ్వడంతో వాహనాల నుంచి పత్తి అన్‌లోడ్ కావడం లేదు. దీంతో రైతులు రోజుల తరబడి వేచి చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరో కాంటాను ఏర్పాటు చేసి త్వరితగతిన అన్‌లోడ్ చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై సీసీఐ కొనుగోలు అధికారులను వివరణ కోరగా రోజుకు 50 నుంచి 100 కూపన్లు ఇస్తున్నామని చెప్పారు. కొన్ని సందర్భాల్లో సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, దీంతో ఆలస్యం జరుగుతోందని తెలిపారు.


పత్తి విక్రయించేందుకు తీసుకొస్తున్న రైతులు

సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

- కేజీబీవీల్లో చదువు సాగక విద్యార్థుల అవస్థలు -వారం రోజులుగా విధులకు హాజరు కాని సిబ్బంది

వాంకిడి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గతంలో ఇచ్చిన హామీ మేరకు తమను క్రమబద్ధీకరించడంతో పాటు డిమాండ్లు నేరవేర్చాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేపడుతుండటంతో కేజీబీవీ, అర్బన్ గురుకులాల్లో బోధన సాగడంలేదు. భవిత కేంద్రాల్లోనూ సేవలు నిలిచిపోయాయి. కుమరం భీం జిల్లాలో 15 కస్తూర్బా పాఠశాలలు, 1 అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఉన్నాయి. ఇందులో 3,942 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 315 మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థలకు డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆర్ట్, విద్య కూడా అందడంలేదు. రాష్ట్ర స్థాయి వరకు ఉత్తర, ప్రత్యుత్తరాలు స్తంభించిపోయాయి. సమ్మెతో విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కేజీబీవీల్లో విధులు నిర్వహించే ప్రత్యేక అధికారు లు(ఎస్‌వో) కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్(సీఆర్టీ), పీజీ-సీఆర్టీలు తమ హక్కుల సాధనకు సమ్మెబాట పట్టారు. దీంతో కేజీబీవీల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం మండల విద్యాధికారులకు అప్పగించింది. రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా అల్పాహారం, భోజనం, వసతి, రక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. సీఆర్టీల్లో కొంత మంది కేజీబీవీల్లోనే ఉండి బాలికల బాగోగులు చూసుకుంటున్నారు. బోధనేతర సిబ్బంది విద్యార్థినుల ఆరోగ్యం, ఇతర అవసరాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. సీఆర్టీల సమ్మె వల్ల బోధనకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని విద్యార్థిలు ఆందోళనకు గురవుతున్నారు. గడువులోగా పదో తరగతి, ఇంటర్, సిలబస్ పూర్తి చేసి పునశ్చరణ తరగతులు నిర్వహించకుంటే వార్షిక ఫలితాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకుని, చర్చలకు పిలిచి తమ సమస్యపై మాట్లాడే వరకు ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈసమ్మె ప్రభావం జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై పడుతుంది. వారి సమస్యలకు పరిష్కారం లభించి ఉపాధ్యా యులు సమ్మె విరమించి విధులకు హాజరై సకాలంలో సిలబస్ పూర్తి చేస్తే విద్యార్థులు వార్షిక పరీక్షలపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. కేజీబీవీ ఉద్యోగులు చేపడుతున్న సమ్మె ఇప్పటికే వారం రోజులు కావస్తోంది.


సీఆర్టీలు లేకపోవడంతో బోధిస్తున్న విద్యార్థులు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలమేళా

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆసిఫాబాద్ ప్రాజెక్టు పరిధిలో మంగళవారం పట్టణంలో బాలమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీడీపీవో తిరుమలదేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ పెంటుబాయి, పోషణ అభియాన్ సిబ్బంది స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులను శిక్షించాలి


వాంకిడిలో రాస్తారోకో చేస్తున్న దళిత నాయకులు

వాంకిడి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పర్భని పట్టణంలో ఇటీవల రాజ్యాంగాన్ని చించివేసిన ఘటనపై గళం విప్పిన లా విద్యార్థి సోమనాథ్ వెంకట్ సూర్యవంశి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వాంకిడి జాతీయ రహదారిపై మంగళవారం దళిత సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. అంతకు ముందు జైతావన్ బుద్ధ విహార్‌లో విద్యార్థి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్, మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జైరాం ఉప్రె మాట్లాడారు. మహారాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి మృతికి కారుకులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ యవజన సంఘం అధ్యక్షుడు మహేష్, అంబెద్కర్ సంఘం నాయకులు హంసరాజ్, శ్యాంరావు దుర్గె, విలాస్, ప్రసాద్, అరుణ్, నాగసేన్, రాజేశ్వర్, శివాజీ, పాల్గొన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయాలి

వాంకిడి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌పీవో ఉమర్ కోరారు. వాంకిడి మండల కేంద్రంలోని రాంనగర్‌లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం అయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శివ, బిల్‌కలెక్టర్ గోవింద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందించేందుకు కృషి

కెరమెరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేవాపూర్ తుమ్మగూడ గ్రామంలో మూడు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన ఆత్రం బారిక్‌రావు, ఆత్రం లక్ష్మణ్‌కు పరిహారం అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరాబాయి అన్నారు. తుమ్మగూడలో ఆదివారం గ్యాస్ సిలిండర్ పేలి మంటలు అంటుకుని ఇళ్లు కాలిపోయిన కుటుంబాలను మంగళవారం ఈశ్వరీబాయి పరామర్శించారు. ప్రమాదాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూ. 2 లక్షల నగదుతో పాటు మూడు తులాల బంగారం ఇతరం ఇంటి సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ఐటీడీఏ పీవో దృష్టికి సమస్యను తీసుకు వెళతానని తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

కెరమెరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో గల మ్యూజియంలో మౌలిక వసతులు కల్పించాలని భీం వర్ధంతి నిర్వహణ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ మంగళవారం డీడీ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. మ్యూజియంలో మైక్‌సెట్, కుర్చీలు, ఎల్‌ఈడీ టీవీ, బీరువాలు, టేబుళ్లు తదితర వస్తు సామగ్రి అవసరముందని చెప్పారు. కొన్ని పరికరాలు పాడయ్యాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. డీడీ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

బస్సులో మర్చిపోయిన మొబైల్ ఫోన్ అప్పగింత

ఆసిఫాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ డిపో బస్సులో ఆసిఫాబాద్ నుంచి చంద్రాపూర్‌కు ప్రయాణం చేసి బస్సులో మంగళవారం మొబైల్ ఫోన్‌ను మర్చిపోయి వెళ్లిన చంద్రపూర్‌కు చెందిన విజయలక్ష్మికి మొబైల్ ఫోన్‌ను ఆర్టీసీ సిబ్బంది అందజేశారు. బస్సులో ప్రయాణిస్తు మొబైల్‌ఫోన్‌ను బస్సులోనే మర్చిపోవడంతో బస్సు డ్రైవర్, కండక్టర్లు గుర్తించి డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు సమాచారం అందించారు. విజయలక్ష్మి ఫిర్యాదు చేయగా తిరిగి మొబైల్‌ఫోన్‌ను మహహారాష్ట్రలోని రాజురా బస్‌స్టేషన్‌లో కండక్టర్ రమేశ్‌కు అందజేశారు.

న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని న్యాయవాదులకు, న్యాయ వాదుల గుమాస్తాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవిందర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఐదేకరాల స్థలంలో ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, ముక్తా సురేష్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, చందన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వంటావార్పు


కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేస్తున్న మధ్యాహ్న బోజన కార్మికులు

ఆసిఫాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న బోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసనలో భాగంగా వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్, రాజేందర్, మధ్యాహ్న బోజన పథకం కార్మికులు శారద, మాయ, రూప పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేప డుతున్న సమ్మ మంగళవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. సమ్మె దీక్ష శిబిరాన్ని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వాంకిడి ఎంఈవో శివచరణ్‌కుమార్ తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు శృతిక, మోహన్, నాగసుధ, తుకారాం, సంతోష్, అనూప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ బేస్‌బాల్ పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా స్థాయిలో బేస్‌బాల్ ఎంపిక పోటీలను మంగళవారం పీటీజీ పాఠశాలలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, వైస్ ప్రిన్సిపాల్ సుజాత పోటీలను ప్రారంభించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు సారంగపాణి, హైదర్, అరవింద్, చిన్నక్క పాల్గొన్నారు.

పడిపోతున్న కనీస ఉష్ణోగ్రతలు

ఆసిఫాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మంగళవారం కెరమెరి మండలంలో 7.1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. తిర్యాణిలో 7.4, బెజ్జూరులో 9.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మంచిర్యాల: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాల్‌పూర్ గ్రామంలో మంగళవారం 9.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోటపల్లి మండలం దేవులవాడలో 9.5, జన్నారం మండల కేంద్రంలో 9.5, జైపూర్ మండల కేంద్రంలో 9.6, దండేపల్లి మండలం వెల్గనూరులో 9.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రెబ్బెన, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కగూడ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఆసిఫాబాద్ మండలం పర్శనంబాల గ్రామానికి చెందిన చౌదరి శ్రీనివాస్(36) అనే యువకుడు రెబ్బెన మండలంలోని నక్కలగూడ వద్ద రోడ్డు దాటుతుండగా మంచిర్యాల నుంచి కౌటాల వెళ్తున్న ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను 108లో సిబ్బంది ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరికి మూడేళ్లు జైలు శిక్ష

జైనూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తూ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు 25 వేల రూపాయల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టు ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పు ఇచ్చారని జైనూర్ సీఐ రమేశ్ తెలిపారు. లింగాపూర్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఉద్ధవ్ సింగ్ సిబ్బందితో కలిసి 28-07-2021న ఉదయం 10 గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాడు. లింగాపూర్ మండలం వంజరిగూడ గ్రామానికి చెందిన మావలే గోవింద్, దోంద్రం అనే ఇద్దరు వ్యక్తులు రెండు సంచులతో అనుమానాస్పదంగా కనిపించారు. సంచులను తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. వారిని విచారించగా వ్యవసాయ క్షేత్రంలో గంజాయిని సాగు చేస్తూ విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. నేరం రుజువు కావడంతో నిందితులకు శిక్ష విధించారు.

మద్యం తరలిస్తున్న వాహనం పట్టివేత



బెల్ట్‌షాపులకు మద్యం తరలిస్తూ పట్టుబడిన ఆటో

జైపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారంలో గల వైన్‌షాప్ నుంచి బెల్ట్‌షాపులకు మద్యం తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం జైపూర్ పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందారం వైన్ షాపు టేకుమట్ల బెల్టుషాపులకు అక్రమంగా మద్యం తరలిస్తున్నారని రామగుండం పోలీస్ కమిషనర్‌కు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించడంతో అప్రమత్తమైన జైపూర్ పోలీసులు మద్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్లపై కేసు

కాగజ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్‌ఐ పురాతన భవనంలో పేకాట ఆడుతున్న నలుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. సమాచారం మేరకు దాడులు నిర్వహించగా నలుగురు పట్టుబడ్డారని, వారి నుంచి రూ.4700లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి అన్నారు. సీపీఐ కార్యాలయంలో అంగన్‌వాడీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వేతనాలు సక్రమంగా రావడం లేదని, రిటైర్ అయిన టీచర్లకు 2 లక్షల రూపాయలు, ఆయాలకు లక్ష రూపాయలు చెల్లించాలని, పెన్షన్ త్వరగా చెల్లించే ఏర్పాటు చేయాలని, ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు వేతనాలు పెంచాలని, టీఏ, డీఏలు ఇంటి అద్దెలు చెల్లించాలని, ఆయాలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కిష్టంపేట్ సెక్టార్, లక్షెట్టిపేట ప్రాజెక్టుకు చెందిన పలువురు ఏఐటీయూసీలో చేరగా, వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌లు కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో భూపతిరావు రమాదేవి, కుసుమ కుమారి, నేరెళ్ల అరుణ, తిరుమల, కాంతకృష్ణ, శంకరమ్మ, రాజమణి, రేణు, నస్రీన్ పాల్గొన్నారు.

గ్యారెంటీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ, పక్కన జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను వంచించిందని బీజేపీ సంస్థాగత రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీరాయణ అన్నారు. జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రజలను మోసగిస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే దారిలో నడుస్తోందని ఎద్దేవా చేశారు. ఏడాదిలోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బీజేపీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి బద్దం లింగారెడ్డి, నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, రజనీష్ జైన్, దుర్గం అశోక్, ముల్కల్ల మల్లారెడ్డి, కొయ్యల ఏమాజీ, ఎనగందుల కృష్ణమూర్తి, అమరాజుల శ్రీదేవి, గాజుల ముఖేష్‌గౌడ్, ముత్తేత సత్తయ్య, మోటపలుకుల గురువయ్య, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

‘కాంట్రాక్టు’ కష్టాలు



గోలేటి జీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

సింగరేణి విస్తరించి ఉన్న జిల్లాల్లోని 11 ఏరియాల్లో సుమారు 20 వేలకు పైగా కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నా వారికి కనీస వేతనాలు, చట్టబద్ధమైన హక్కులను యాజమాన్యం వర్తింప జేయడం లేదు. హైపవర్ వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నా, ఇంతవరకు పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోతున్నారు.

- పర్మినెంట్‌కు నోచుకోని కాంట్రాక్టు కార్మికులు
- అమలు కాని హైపవర్ వేతనాలు
- కుటుంబాల పోషణకు ఇబ్బందులు
- శ్రమదోపిడీకి గురవుతున్నామని ఆవేదన

రెబ్బెన, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో సుమారు 20వేలకుపై కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. బొగ్గు ఉత్పత్తిలో కాంట్రాక్టు కార్మికులు పర్మినెంటు కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. కాని వేతనాలు సమానంగా రావడం లేదని వాపోతున్నారు. ఉద్యోగ భద్రతకు నోచుకోవడం లేదు. సింగరేణి సంస్థలో జరిగే బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకలో కీలక పాత్రను కూడా పోషిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

సింగరేణి సంస్కరణల ఫలితంగా 1.20 లక్షల మంది కార్మికుల నుంచి కుదించేశారు. పర్మినెంటు కార్మికులను తొలగించి వారి స్థానంలో కొత్తగా భర్తీ చేయకుండా యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులతో కాలం వెల్లదీస్తోంది. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదు. సింగరేణి సంస్థలో రెగ్యులర్ కార్మికులకు దీటుగా కాంట్రాక్టు కార్మికులు అన్ని విభాగాల్లో పని చేస్తున్నారు.

బొగ్గు నాణ్యతలో..

గనుల్లోని భూగర్భంలో ఉత్పత్తి అయిన బొగ్గును ఉపరితలానికి తరలించడం లాంటి పనులు కాంట్రాక్టు కార్మికులే నిర్వహిస్తారు. బొగ్గు ఉత్పత్తి మొదలు బొగ్గు సరఫరా సంక్షేమ రంగాల్లో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగింది. బొగ్గు ఉత్పత్తి, రవాణా స్పోర్ట్స్ పారిశుధ్యం, బెల్టు క్లినింగ్, తోటమాలి, హౌస్ కీపింగ్ తదితర వాటిలో కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. జీవో ప్రకారం మైనింగ్ యాక్టు ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉంది. పదిహేను సంవత్సరాలుగా సంస్థలో కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందుల నడుమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తాము గట్టెక్కితే పర్మినెంటు చేస్తామని 2014 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పర్మినెంటు విషయం ఊసెత్తడం లేదు. తమను వెంటనే పర్మినెంటు చేయాలని కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టు అన్‌స్కిల్డ్ కార్మికుడికి రూ.522, సెమిస్కిల్డ్‌కు రూ.610, స్కిల్డ్‌కు రూ.734, హై స్కిల్డ్‌కు రూ.862 చెల్లిస్తున్నారు. ఇప్పటికీ కార్మికులకు చట్టబద్ధంగా అందాల్సిన బకాయిలు కూడా రావడం లేదు.

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి..
బోగే ఉపేందర్, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరి



సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం పెరిగిన వేతనాలు చెల్లించాలి. పర్మనెంటు విషయంలో కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. బోనస్-2006 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టు కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందించాలి. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి.

సమస్యలను పట్టించుకోవడం లేదు..
సురేందర్, కాంట్రాక్టు కార్మికుడు



సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం పట్టించుకోవడం లేదు. పర్మనెంటు కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలు కాంట్రాక్టు కార్మిక కుటుంబాలకు కూడా వర్తింపజేయాలి. పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి. అధికారులు మాకు న్యాయం చేయాలి.

కనీస వేతనాలు చెల్లించాలి..
సాగర్‌గౌడ్, కాంట్రాక్టు కార్మికుడు



సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు హైపవర్ కమిటీ సూచించిన వేతనాలు చెల్లించాలి. నామా మాత్రపు వేతనాలతో ఇబ్బందులు పడుతున్నాం. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారింది. ఉన్నతాధికారు లు దృష్టి సారించి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి.

పోలింగ్ కేంద్రాల ప్రక్రియ పూర్తి

సిర్పూరు(టి), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 144 కేంద్రాల పోలింగ్ ప్రక్రియ జాబితా పూర్తయినట్లు ఎంపీడీవో టి సత్యనారాయణ, గ్రామ పంచాయతీ ఈవో తిరుపతి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం నోటీసు బోర్డుపై మంగళవారం స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల జాబితాను అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల పక్షం నాయకుల అభ్యంతర మేరకు మండల కేంద్రంలోని జీయూపీఎస్ ఉన్న పోలింగ్ కేంద్రాన్ని మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాలకు మార్చినట్లు తెలిపారు. మిగితావి యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

పెన్షన్ ఉపయోగకరం

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబంతో సంతోషంగా గడిపేందుకు పెన్షన్ ఉపయోగకరమని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. మంగళవారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ టౌన్ ఎస్‌హెచ్‌వో రాజేంద్రప్రసాద్, జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కరుణగౌడ్, కాగజ్‌నగర్ అధ్యక్షుడు జయదేవ్, ఎస్‌బీఐ, టీజీబీ బ్యాంకు మేనేజర్లు సతీష్, వినోద్‌కుమార్, వంశీకృష్ణ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోపణలు సరికాదు’

బెజ్జూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొలావార్‌లపై చేస్తున్న ఆరోపణలు సరికాదని కొలావార్ మండల అధ్యక్షుడు పెద్దల సంతోష్ అన్నారు. మంగళవారం ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16న ఉట్నూర్ ఐటీడీఏ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించిన కొలాం నాయకులు తమ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్యపై కొలావార్ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ సమాజంపై కొలాం నాయకులు అసత్యపు ఆరోపణలు చేసినట్టయితే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బక్కయ్య, సకారం, శ్యాంరావు, మల్లేష్, పోశం, జయరాం తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

పెంచికల్‌పేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం కోసం మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన చంద్రు తన సొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చినట్లు ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. ఈ సందర్భంగా స్థల దాతను గ్రామస్తులు అభినందించారు. కార్యక్ర మంలో ఆర్‌ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లగచర్లలో రైతులను అరెస్టు చేయడం సరికాదు

కాగజ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండగల్ నియోజకవర్గంలోని లగచర్లకు చెందిన రైతులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భారత రాజ్యాంగం ద్వారా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దళిత గిరిజన రైతులపై అణిచివేత చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా కొండగల్ నియోజకవర్గంలో లగచర్లలో పేద రైతన్నల భూములను బలవంతంగా లాక్కుంటున్నదని చెప్పారు. వీరిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు రైతన్నలపై అక్రమ కేసులు పెడుతున్నట్టు వివరించారు. రైతన్నలు తమ జీవనాధారాన్ని కాపాడాలని, పది నెలలుగా విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇంత వరకు పట్టించుకోవడం లేదన్నారు. వారిపై కేసులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ లెండుగురే శ్యాంరావుతో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి అన్నారు. మంగళవారం అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందించి ఆర్‌కే 7 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్, కొమురయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధికి అందరూ పాటుపడాలని ఎస్‌ఓ టు జీఎం ఎస్ సత్యనారాయణ అన్నారు. మల్టిడిపార్ట్‌మెంటల్ సమావేశం జీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. గనులలో మన బాధ్యతలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. అంకితభావం, సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచుకుంటూ సంస్థను ముందుకు తీసుకుపోవాలని కోరారు. సంస్థ పురోగతికి అన్ని గనుల అధికారులు, ఉద్యోగులు లక్ష్యం చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు, ఆనంద్‌కుమార్, రాజేశ్వర్, మల్లయ్య, ఎస్‌ఈ రామిరెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, పిట్ కార్యదర్శి రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ

రిటైర్డు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నాలుగు దశాబ్దాల పాటు పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ అన్నారు. స్థానిక హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థలో రిటైర్డు కార్మికులకు 11వ వేజ్‌బోర్డు సంబంధించిన పెన్షన్ అమలుతో పాటు ఎరియర్స్ చెల్లించాలన్నారు. రిటైర్డు అయిన తర్వాత వారు వీలున్న చోట స్థిరపడ్డారన్నారు. వారు ఇక్కడకు వచ్చినప్పుడల్లా రెస్టు హాల్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని, ఎన్టీపీసీ తరహా రెస్టుహాల్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు ఇవ్వాలన్నారు. త్వరలోనే విరమణ కార్మికుల సమస్యల పైన హెచ్‌ఎంఎస్ పోరాట కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, అశోక్‌కుమార్, వంగల మహేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్, రామస్వామి, అశోక్‌కుమార్, మహేశ్

ప్రమాద రహిత ఉత్పత్తే లక్ష్యం

మందమర్రి టౌన్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : రక్షణకు ప్రధాన శిక్షణాలయాలు ఎంవీటీసీ అని, ప్రమాద రహిత ఉత్పత్తి ప్రధాన లక్ష్యమని జీఎం దేవేందర్, రక్షణ కమిటీ కన్వీనర్ జీవీ కోటిరెడ్డి తెలిపారు. మంగళవారం 55వ రక్షణ వారోత్సవాల్లో భాగంగా ఎంవీటీసీని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగు లకు ఇస్తున్న శిక్షణ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంవీటీసీని పరిశీలించారు. వారు మాట్లాడుతూ రక్షణ కోసం ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశపెట్టడం జరిగిందని, రక్షణ పరికరాలను విధిగా వినియోగించుకోవాలని తెలిపారు. అన్ని వృత్తులకు సంబంధించిన ఉద్యోగులు ఎంవీటీసీ కార్యాలయంలో తరగతులకు వస్తున్నందున వారికి తప్పకుండా ప్రతీ అంశం అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. బోధించే అంశాలను తప్పకుండా ఉద్యోగులు గుర్తుంచుకుంటారని ఆయన పేర్కొన్నారు. కార్యాలయంలో శిక్షణ బోధన ఎంత చేస్తే అంత పకడ్బందీగా గనుల, డిపార్టుమెంట్లలో వాటిని వినియోగిస్తూ విధులు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా కమ్యునికేషన్ సెల్ వారు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేకే 1 గ్రూపు ఏజెంట్ రాందాస్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎంవీపీఏ ఎంవీటీసీ విజయ్‌సింగ్, మేనేజర్ శంకర్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ఒప్పందాలను అమలుపర్చాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్‌సీకేఎస్-సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 23న నిర్వహించే సింగరేణి ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా కాంట్రాక్టు కార్మికులు నల్ల రిబ్బన్లు, జెండాలతో నిరసన తెలుపాలని కోరారు. కార్యక్రమంలో సంపత్, సమ్మయ్య, అశోక్,తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదరహితంగా పనులు చేపట్టాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రతి గనిలో ఉద్యోగులు తాము చేసే పనులను ప్రమాదరహితంగా చేపట్టాలని రక్షణ తనిఖీ కమిటీ చైర్మన్, జీఎం (పర్యావరణం) సైదులు, బెల్లంపల్లి రీజి యన్ జీఎం(రక్షణ) రఘుకుమార్ అన్నారు. ఆర్‌కే న్యూటెక్ గనిపై రక్షణ సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యోగులు తమ విధులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం ఎస్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి

మందమర్రి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు లాభాల దిశలో నడిపిస్తున్న కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్ అన్నారు. మంగళవారం ఏరియాలోని కేకే 5 గని వద్ద గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సంస్థలో 40 సంవత్సరాలు పని చేసి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత క్వార్టర్ ఖాళీ చేస్తేనే గ్రాట్యుటీ డబ్బులు చెల్లిస్తున్నారని, దీంతో కార్మికులకు ఉండడానికి నివాసం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో దీనిపై హామీ ఇచ్చిందని, ఆ హామిని అమలు చేయాలని కోరారు. రెండు ప్రధాన డిమాండ్లకు సంబంధించి ముఖ్యమంత్రికి లేఖలు రాసి అందజేయనున్నట్లు తెలిపారు. 11 ఏరియాల్లో కార్మికుల సంతకాల సేకరణ చేపట్టామని, నిరంతరం కార్మికుల హక్కుల కోసం త్యాగాలకైనా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అనంతరం సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బేతి భరత్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రెబ్బెన, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం నాయకులు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీఎం శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలో గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ నాయకులతో మంగళవారం గోలేటి టౌన్ షిప్‌లోని జీఎం కార్యాలయంలో స్ట్రక్చరల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీయూసీ నాయకులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. మాదారం, గోలేటి టౌన్ షిప్‌లోని రక్షిత మంచినీటి అందించాలన్నారు. భీమన్న స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే ఓపెన్ జీంను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షులు బి.మొగిలి, శేషు, ఎం.శ్రీనివాస్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

- క్రీడాకారుల గ్రామం గోలేటి

రెబ్బెన, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల గ్రామం గోలేటి అని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం 91వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా గోలేటిలోని శ్రీ భీమన్న క్రీడా మైదానంలో కంపెనీ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాపై నమ్మకంతో కంపెనీ స్థాయి పోటీలు నిర్వహించేందుకు అవకాశం ఇచ్చినందుకు ఉన్నతాధికారుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐయూటీసీ నాయకుడు ఎస్.తిరుపతి, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్, బెహర, పర్సనల్ మేనేజర్ ఆర్.తిరుపతి, సీనియర్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ డి.జాన్‌వెస్లి, ఎస్ఇ(సివిల్) మదీనా బాషా, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

ఎన్‌హెచ్-63 పనులకు బ్రేక్

5వ పేజీ తరువాయి

యాక్ట్ సెక్షన్ 3సీ ప్రకారం అధికారులు విధానాలను అమలు చేయలేదని, రైతుల అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోక పోవడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. ఈ మేరకు జస్టిస్ వినోద్‌కుమార్ ఎన్‌హెచ్-63 పనులు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం..: లగిశెట్టి రాజమౌళి, గుడిపేట



రైతులకు ఉపాధి లేకుండా చేసే జాతీయ రహదారి విస్తరణ పనులను నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదు. హైకోర్టు తీర్పుతో రైతులకు సరైన న్యాయం లభించింది.

న్యాయం గెలిచింది..: నాగిరెడ్డి రమాదేవి, సూరారం



అధికారుల చర్యలు ఏడాది కాలంగా కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. భూములు ఇవ్వమని చెప్పినా పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లోనే రైతులం కోర్టును ఆశ్రయించాం. కోర్టు తీర్పు ద్వారా న్యాయమే గెలిచింది.

రైతులకు అన్యాయం జరగొద్దు

హైకోర్టు న్యాయవాది దోలిశెట్టి పోచయ్య



భూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతుల గోడును పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఉన్న భూములన్నీ రహదారి పేరిట లాగేసుకుంటే వాళ్లు ఎలా బతకాలి. నేషనల్ హైవే అథారిటీ యాక్ట్ ప్రకారం కూడా చెల్లింపులు చేయడం లేదు. అందుకే రైతుల పక్షాన న్యాయ స్థానంలో వాదనలు వినిపించాను.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన



విద్యార్థులకు మామిడి మొక్కలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

బెల్లంపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో చదివే పాఠశాల, కళాశాల విద్యార్థులకు మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయంపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. పొలాల సాగుపై, మొక్కలు నాటే విధానం, సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. పంటలు ఎలా పండుతున్నాయి, వాటిని రైతులు ఏ విధంగా పండిస్తున్నారు. ఆహారం ఎలా వస్తుంది అనే విషయాలపై క్షేత్రస్థాయిలో వివరించారు. మొక్కలకు నీరు అందించే విషయంలో డ్రిప్ ఇరిగేషన్ ఏ విధంగా ఉపయోగపడుతుంది, సేంద్రియ ఎరువుల వల్ల భూమికి నష్టం కలగకుండా ఉంటుందని సూచించారు. చదువుతోపాటు వ్యవసాయ రంగంపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చన్న తెలిపారు. అగ్రికల్చర్, వృత్తివిద్య బోధకురాలు మౌనిక, ఉపాధ్యాయులు నాగవర్మ, రాంనరేష్, ఉద్యాన శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌పై మగువల మక్కువ



బెల్లంపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శారీ, దానికి తగినట్లు బ్లౌజ్ కుట్టించుకునే వారు... ప్రస్తుతం ట్రెండ్ మారింది... శారీతో పాటు బ్లౌజ్‌లకు మగ్గం వర్క్ చేయించుకుంటున్నారు... దీంతో పట్టణం, మండల కేంద్రాల్లో సైతం మగ్గం దుకాణాలు వెలుస్తున్నాయి.

మగ్గం వర్క్‌కు ప్రాధాన్యం పెరిగింది... మహిళలు ధరించే పట్టుచీరలు, బ్లౌజులతోపాటు పంజాబీ డ్రెస్‌లపై రకరకాల డిజైన్లతో వర్క్ చేయిస్తున్నారు. ఏ చిన్న శుభకార్యానికైనా వర్క్ చేయించడం తప్పనిసరైంది. దుస్తులకన్న ఎక్కువ ధరను వర్క్‌కు వెచ్చిస్తున్నారు. వస్త్రాలపై మగ్గం వర్కు డిజైన్‌లు కాలానికి అనుగుణంగా, మనసుకు నచ్చే విధంగా చేయించుకుంటూ నయా ట్రెండ్ వైపు వెళ్తున్నారు. మగ్గం, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ పనులతో అతివలకు ఉపాధి లభిస్తుండడంతో పాటు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారు.



మగ్గం వర్కు చేస్తున్న నిర్వాహకులు

- బ్లౌజ్, శారీస్‌లపై స్టిచ్చింగ్
- మగ్గం, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ డిజైన్లు
- వేల రూపాయలు వెచ్చింపు
- స్థానికులతోపాటు పలు రాష్ట్రాల వారికి ఉపాధి

వ్యాపారంలో రాణిస్తున్న మహిళలు

ఒకప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన మగ్గం వర్కు, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ పట్టణాలకు సైతం విస్తరించింది. పైగా కొత్త ట్రెండ్‌పై మహిళలు ఆసక్తి చూపుతుండడంతో అందుకు అనుగుణంగా జిల్లాలో వందకు పైగా మగ్గం ఎంబ్రాయిడరీ షాపులు వెలిశాయి. పండగలు అయినా, ఫంక్షన్‌లు అయినా, ఏ చిన్న శుభకార్యమైనా మహిళలు తమ వస్త్రాలపై నూతన అలంకరణ చేయించుకోవడానికి మగ్గం, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్కులపై ఆసక్తి చూపుతున్నారు. చేతితో తయారు చేసే వివిధ రకాల డిజైన్‌లతో పాటు కంప్యూటర్ ఎంబ్రాయిడరీ పనులకు డిమాండ్ నెలకొంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు మహిళలు తమ వస్త్రాలపై కొత్తరకం డిజైన్‌లు చేయించుకునేందుకు ఆసక్తి చూపుతుండడంతో వ్యాపారం జోరుగా సాగుతుంది.

రూ.500 నుంచి రూ. 10 వేల వరకు

వస్త్రాలపై వేయించుకునే డిజైన్‌లకు వేల రూపాయలు ఖర్చు అవుతున్నా మహిళలు వెనకడుగు వేయడం లేదు. రూ. 500 నుంచి రూ. 10 వేలకు పైగా విలువ చేసే డిజైన్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. దాదాపు 600 రకాల డిజైన్‌లు అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. మగ్గంపై చేతితో చేసే పనులకే మహిళలు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వర్కర్లు

మగ్గం వర్క్ కోసం ఇతర రాష్ట్రాల నుంచి వర్కర్లను తీసుకువస్తున్నారు. కలకత్తా, మధ్య ప్రదేశ్, లక్నో రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి చేయిస్తున్నారు. వీరికి ఉండడానికి ఇల్లు, గృహ అవసరాలు చూసుకుంటున్నారు.

జిల్లాలో మగ్గం వర్కుషాపుల్లో పనిచేయడానికి 500 మందికి పైగా వర్కర్లు ఉన్నారు. పనికి తగిన వేతనం ప్రతీ వారం అందిస్తున్నారు. కొత్త కొత్త డిజైన్‌లతో మగ్గం వర్కు, వివిధ ఆకృతుల్లో స్టిచ్చింగ్ చేయడం వల్ల వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది. మొబైల్‌లో ఎలాంటి డిజైన్‌ను చూపించినా అదే విధంగా స్టిచ్చింగ్ చేసి వినియోగదారులకు అందిస్తున్నారు. పెళ్ళిళ్లు, ఫంక్షన్‌ల సీజన్‌లలో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారని మగ్గం షాపులు నిర్వహించే మహిళలు చెబుతున్నారు.

మహిళలు ఆసక్తి చూపుతున్నారు

ఎస్‌కె అమీనా, మగ్గం వర్కు షాపు నిర్వహకురాలు, బెల్లంపల్లి



15 సంవత్సరాల నుంచి మగ్గం వర్కు దుకాణం నిర్వహిస్తున్నా. నేను ఉపాధి పొందడంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నా. ఎవరికి ఎలాంటి డిజైన్‌లు కావాలన్నా వాటిని వేస్తున్నాం. ప్రస్తుతం బ్లౌజులు, చీరలపై మగ్గం డిజైన్‌లు చేయించుకునేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా మగ్గం వర్కులో పేరు పొందిన వారిని ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి వ్యాపారం నిర్వహిస్తున్నాం.

పలువురికి ఉపాధి కల్పిస్తున్నా

సంధ్య, మగ్గం , కంప్యూటర్ ఎంబ్రాయిడరి వర్కు షాపు నిర్వహకురాలు, బెల్లంపల్లి



మగ్గం వర్కు ద్వారా స్థానికులకు, ఇతర రాష్ట్రాల వారికి ఉపాధి కల్పిస్తున్నా. ఆరు సంవత్సరాలుగా మగ్గం వర్కు దుకాణాన్ని నిర్వహిస్తున్నా. డిజైన్‌లకు సంబంధించిన మెటీరియల్‌ను హైద్రాబాద్, కలకత్తా నుంచి తీసుకువస్తున్నా. ప్రస్తుతం మహిళలు మగ్గం వర్కు డిజైన్‌లపై ఆసక్తి చూపుతుండడంతో వ్యాపారం బాగా నడుస్తుంది.

ఐదు మందికి పైగా వచ్చాం

ఖాసీం, మధ్యప్రదేశ్



చిన్నప్పటి నుంచే మగ్గం వర్కు నేర్చుకున్నా. మా ప్రాంతంలో ఎక్కువ మందికి మగ్గం వర్కు పనులు వచ్చి ఉండడంతో అక్కడ పనులు దొరకక ఉపాధి కోసం ఇక్కడకు వచ్చాం. ఎలాంటి డిజైన్‌లు అయినా వేస్తాం. సీజన్, అన్‌సీజన్‌లలో కలిపి నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు సంపాదిస్తాం. మగ్గం వర్కు షాపులు నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.



న్యూస్ బాక్స్

రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం కార్యవర్గం



మోతె రాఘవరెడ్డి, అధ్యక్షుడు, మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి



చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి

నస్పూర్, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం నస్పూర్ మున్సిపాలిటీ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సీసీసీలోని సంఘం కార్యాలయంలో ఎన్నిక జరిగింది. జిల్లా కార్యదర్శిగా గొట్టం తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా దూదిపాల విజయపాల్‌రెడ్డి, నస్పూర్ మున్సిపాలిటీ గౌరవాధ్యక్షుడిగా అనుమాండ్ల వెంకట్ రెడ్డి, అధ్యక్షుడిగా మోతె రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాకాల మహిపాల్ రెడ్డి, కోశాధికారిగా చెరుకు చంద్రశేఖర్ రెడ్డి, అధికార ప్రతినిధిగా ఆళ్ల రాజేందర్‌రెడ్డితోపాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, ముఖ్య సలహాదారులను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం రెండేళ్ల పాటు పనిచేస్తుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

నెన్నెల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోందని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరామ్‌సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పార్టీలో చేరేందుకు చాలా మంది ముందుకు వస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికి టీడీపీకి అభిమానులు ఉన్నారన్నారు. తమ పార్టీ కార్యకర్తలకు పెద్దపీట వేస్తుందన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. గ్రామ కమిటీలు వేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. మండల అధ్యక్షుడు ఠాకూర్ గణేష్‌సింగ్, ఉపాధ్యక్షులు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి పథకాల పనులు వేగవంతం

- రూ. 73 కోట్లతో పనులు - తీరనున్న నీటి సమస్య

నస్పూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ మున్సిపాలిటీ ప్రజల దాహార్తిని తీర్చడానికి మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పట్టణ వాసులకు గోదావరి నీటిని సరఫరా చేయడానికి అమృత్-2.0 పథకం ద్వారా రూ. 73 కోట్ల వ్యయంతో ఏడు చోట్ల ట్యాంకుల నిర్మాణంతోపాటు సీతారాంపల్లిలో మంచినీటి శుద్ధి కేంద్రం, గోదావరి నది వద్ద ఇన్‌టెక్ వెల్, కొత్త పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. పథకం నిర్మాణ పనులు పూర్తయితే పట్టణ వాసులకు నీటి సమస్య తీరనుంది. ఇటీవల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు మంచినీటి పథకం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం నిర్మాణ పనులు అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు పనులను వేగవంతం చేశారు. గోదావరి నదిలో ఇది వరకు ఉన్న ఇన్‌టెక్ వెల్‌ను ప్రస్తుత స్కీంకు అనుగుణంగా మార్పులు చేసి పైపులైన్ నిర్మాణం చేస్తారు. అక్కడి నుంచి సీతారాంపల్లి రైతువేదిక వెనుక మంచినీటి శుద్ధి కేంద్రం నిర్మిస్తారు. పట్టణంలోని ఏడు చోట్ల నస్పూర్ రోడ్, సీతారాంపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, నందనవనం పార్కు సమీపంలో, శ్రీరాంపూర్, హనుమాన్ టెంపుల్, శ్రీరాంపూర్ బస్టాండ్ ఎదురుగా మంచినీటి ట్యాంకులను నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకులకు 18 కిలో మీటర్ల పైపులైన్ నిర్మించి నీటిని సరఫరా చేస్తారు. ఏడు చోట్ల ఉన్న ట్యాంకుల నుంచి 11 కిలో మీటర్ల దూరం పైపులైన్ నిర్మించనున్నారు. 2026 జూన్ 26 నాటికి ట్యాంకులు, ఇన్‌టెక్ వెల్, పైపులైన్ పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ట్యాంకులను, పైపులైన్‌ను ఇదివరకు ఉన్న మిషన్ భగీరథ ట్యాంకులకు అనుసంధానం చేసి అన్ని వాడల్లోని ఇళ్లకు మంచి నీటిని అందించాలనే లక్ష్యంతో అమృత్-2.0 పథకం పనులు ప్రారంభించారు.



నస్పూర్‌లో నిర్మాణంలో ఉన్న మంచినీటి ట్యాంకు

మిషన్ భగీరథలో ఇంటి నల్లా కనెక్షన్ పొందని వారు కూడా ఈ కొత్త స్కీంలో కనెక్షన్ ఇవ్వనున్నారు. అమృత్-2.0 పథకం పూర్తయితే పట్టణంలో మంచినీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుందని భావిస్తున్నారు.

మున్సిపల్ పబ్లిక్ హెల్త్ డివిజనల్ ఇంజనీర్ మధుకర్‌ను సంప్రదించగా ప్రస్తుతం నిర్మాణ పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. 2026 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. అమృత్-2.0 పథకం ద్వారా రూ.73 కోట్ల వ్యయంతో పనులు చేపట్టామన్నారు. తద్వారా మంచినీటి సమస్య చాలా వరకు తీరనుందన్నారు.

రోడ్డుపైనే ధాన్యం కుప్పలు..
ఆదమరిస్తే ప్రమాదం..



కోండాపూర్‌లో రింగ్ రోడ్డుపై ఆరబెసిన ధాన్యం కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

దండేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చిన తరువాత విక్రయించడానికి నానా తంటాలు పడుతున్నారు. వానాకాలం పంట నూర్పిడి చేసిన రైతులు ధాన్యంలో తేమ శాతంను తగ్గించడానికి సరైన స్థలాలు లేకపోవడంతో రోడ్డుపైన ఆరబెడుతున్నారు. దండేపల్లి మండలం మ్యాదరిపేట- గూడెం రింగరోడ్డుపై రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. ఉదయం ఆరబోయడం, సాయంత్రం కుప్పగా చేసి దానిపై కవర్లు కప్పుతున్నారు. రోడ్డుపై ప్రమాదమని తెలిసినా రైతులకు తప్పడం లేదు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వేతనం పెంచాలి



దండేపల్లి విద్యా వనరుల కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన నిర్వాహకులు

దండేపల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని మధ్యాహ్నభోజన నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు న్యాలం శ్రీదేవి డిమాండ్ చేశారు. మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవోకు వినతిపత్రం అందించేందుకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవ వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదన్నారు. కేవలం రూ 3వేల వేతనం ఇవ్వడంతో కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలల పెండింగ్ బిల్లులతోపాటు ఏడాదిగా నిలిచిపోయిన కోడిగుడ్ల బిల్లులు, గౌరవ చెల్లించాలన్నారు. ప్రసుత్తం కోడిగుడ్డు ధర రూ.7 కాగా ప్రభుత్వం రూ.5 చెల్లిస్తుందని, దీంతో నష్టపోతున్నామన్నారు. కనీస వేతనం రూ.18వేలకు, మెస్ బిల్లు రూ. 20కి పెంచాలని, కోడి గుడ్డుకు రూ.7 చెల్లించాలన్నారు. ఉచిత సిలిండర్లు, వంటపాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ప్రతీ నెల 5తేదీలోపు మధ్యాహ్నభోజన నిర్వాహకులకు బిల్లులతో పాటు గౌరవ వేతనం చెల్లించాలన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 24 నుంచి మధ్యాహ్నభోజన పథకం నిలిపివేసి ఆందోళన బాట పడుతామని హెచ్చరించారు. సంఘం మండల అధ్యక్షురాలు గడికొప్పుల మల్లీశ్వరీ, సభ్యులు శంకరమ్మ, లత, శ్యామల, సరోజ, జమున, గంగమ్మ పాల్గొన్నారు.


క్రమశిక్షణతో చదివేతేనే బంగారు భవిష్యత్తు



వెల్గనూర్ పాఠశాలలో మాట్లాడుతున్న విశ్రాంత డైట్ అధ్యాపకుడు మల్లారెడ్డి, పాల్గొన్న ఉపాధ్యాయులు

దండేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని విశ్రాంత డైట్ అధ్యాపకుడు డాక్టర్ తుమ్మల మల్లారెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నైతిక విలువలు, క్రమశిక్షణ, కుటుంబ బంధాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో చదువుకొని ఉన్నత స్థాయిలో నిలిచే విధంగా కష్టపడి చదువుకోవాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉపాధ్యాయులు బోధించే ప్రతి పాఠ్యాంశం శ్రద్ధగా వినాలన్నారు. మల్లారెడ్డిని హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పాల్గొన్నారు.

పత్తి నర్సింహారెడ్డి సేవలు ఆదర్శం




నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పూర్వ విద్యార్థులు

జైపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ పత్తి నర్సింహారెడ్డి ఆదర్శనీయుడని ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన పత్తి నర్సింహారెడ్డి జయంతిని పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏసీపీ వెంకటేశ్వర్, తహసీల్దార్ వనజారెడ్డి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడతూ, విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను గుర్తు పెట్టుకొని ఆయన జయంతి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల కోసం రోడ్డు నిర్మిస్తే 24 ఏళ్ల తరువాత ఆయన జ్ఞాపకార్థం రోడ్డుకు ఆయన పేరు పెట్టుకోవడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులకు కాకుండా, ఉపాధ్యాయులకు కూడా జీవితంలో ఎదగడానికి, స్థిరపడడానికి ఆయన సలహాలు, సూచనలు ఇచ్చేవారని ఆయనతో పనిచేసిన ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు. పలువురు పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సారంగపల్లి గ్రామ పంచాయతీలో తుర్కపల్లి నుంచి మందమర్రికి వచ్చే రహదారి కల్వర్టు సమీపంలో రహదారి పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



'కాంట్రాక్టు' కష్టాలు

- పర్మినెంట్‌కు నోచుకోని కాంట్రాక్టు కార్మికులు
- అమలు కాని హైపవర్ వేతనాలు
- కుటుంబాల పోషణకు ఇబ్బందులు
- శ్రమదోపిడీకి గురవుతున్నామని ఆవేదన 6

మగ్గం వర్క్‌పై మగువల మక్కువ

- బ్లౌజ్, శారీస్‌లపై స్టిచ్చింగ్
- మగ్గం, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ డిజైన్లు
- వేల రూపాయలతో వెచ్చింపు 7
- స్థానికులతోపాటు పలు రాష్ట్రాల వారికి ఉపాధి



చీరపై కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్ చేస్తున్న షాపు నిర్వాహకురాలు

ఎన్‌హెచ్-63 పనులకు బ్రేక్





- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- విధానాలు అమలు చేయకపోవడమే కారణం
- విన్నపాలు పట్టించుకోకపోవడాన్ని తప్పుపట్టిన ధర్మాసనం
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

మంచిర్యాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్-జగిత్యాల-మంచిర్యాల జిల్లాల్లో ఎన్‌హెచ్-63 విస్తరణ పనులకు బ్రేక్ పడింది. పనులు నిలిపివేయాలంటూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ రహదారిని విస్తరించేందుకు కేంద్రం గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరిట పనులకు అనుమతులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మీదుగా జగిత్యాల-మంచిర్యాల వరకు మొత్తం 148.6 కిలోమీటర్ల పొడవున 63వ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

గతంలో ఉన్న రోడ్డును విస్తరించడంతోపాటు అనుకూలంగా లేనిచోట కొత్తగా నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన భూమి సేకరించాలని నేషనల్ హైవే అథారిటీని ఆదేశించింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీలకు దూరంగా గుట్టలు, పట్టా భూముల మీదుగా సాగేలా అలైన్‌మెంట్ రూపొందించారు. అలైన్‌మెంట్ ప్రకారం నిజామాబాద్ జిల్లా బాల్కొండలోని ఎన్‌హెచ్-44 నుంచి ప్రారంభమయ్యే రహదారి పలు గ్రామాల మీదుగా జగిత్యాల జిల్లాలో ప్రవేశిస్తుంది.

హై కోర్టును ఆశ్రయించిన రైతులు...

ఎన్‌హెచ్-63 కోసం అధికారులు మూడు దఫాలుగా రూట్ మ్యాప్‌లో మార్పులు చేశారు. మొదటి అలైన్ మెంట్ ప్రకారం కొందరు బడాబాబులకు నష్టం వాటిల్లు తుండడంతో వారి ఒత్తిడికి తలొగ్గి రెండో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. లక్షెట్టిపేట నుంచి ముల్కల్ల వరకు పూర్తిగా నివాస గృహాల మీదుగా వెళ్తుంది. దీనివల్ల సామాన్య ప్రజానీకానికి నష్టం కలిగేలా ఉంది. అష్టకష్టాలు పడి నిర్మించుకున్న ఇళ్ల కూల్చివేతకు గురవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సర్వే పనులను అడ్డుకోవడం, భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ ఆందోళనలు నిర్వహించారు. దీనికి స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు మూడో రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. కొత్త అలైన్‌మెంట్‌తో జీవనాధారామైన సాగు భూములను సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ అలైన్‌మెంట్ ప్రకారం లక్షెట్టిపేట మండలం మీదుగా గోదావరి నదికి సమాంతరంగా పంట పొలాలు, చేల మీదుగా రహదారి నిర్మాణం జరగాల్సి ఉంది. గతంలో ఈ ప్రాంత రైతులకు చెందిన భూములు పెద్ద ఎత్తున శ్రీపాదఎల్లంపల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గరయ్యాయి. మిగిలిన కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మళ్లీ రహదారి నిర్మాణానికి భూములు సేకరిస్తుండటంతో వారంతా ఆందోళన బాట పట్టారు. తమకు నష్టం కలిగించే రూట్‌మ్యాప్‌ను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల వివరించినా ఫలితం లేకపోవడంతో హై కోర్టును ఆశ్రయించారు.

పనులు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ....

రైతుల పక్షాన వెల్గటూర్‌కు చెందిన న్యాయవాది దోరిశెట్టి పోచయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన ధర్మాసనం ఎన్‌హెచ్-63 పనులు ఆపాలని డబ్ల్యూపీ నెం.35476/2024 ద్వారా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌హెచ్ అథారిటీ

మిగతా 7లో

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు



ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం వంద పడకల ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, వసతులపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వైద్యులకు పలు సూచనలు చేశారు. త్వరలోనే ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యులను నియమించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని ల్యాబ్, ప్రసూతి వార్డు, డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమాధికారికి సన్మానం

గర్మిళ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమాధికారిగా బాధ్యతలు చేపట్టిన రౌఫ్‌ఖాన్‌ను దివ్యాంగుల ఆధ్వర్యంలో సన్మానించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో 5శాతం రిజర్వేషన్ కల్పించాలని, నిధులు, ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అవకాశం కల్పించాలని కోరారు. బూర్ల మహేందర్, రాచర్ల రాజయ్య, రమణి, నరేష్, భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ విద్యుత్ కేంద్రం పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

కాలువలో చేపల వేట

దండేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కడెం జలాశయం నుంచి సాగు నీటి విడుదల నిలిచిపోయింది... కాలువలో అక్కడక్కడ కొద్దికొద్దిగా నీళ్లు నిలిచిఉన్నాయి... ఆ నీటిలో ఉన్న చేపలను పట్టుకోవడానికి కాలువ సమీపంలో ఉన్న ప్రజలు దోమల తెరల ద్వార చేపలు పడుతున్నారు. తానిమడుగు గ్రామ శివారు గూడెం ఎత్తిపోతల పథకం వద్ద కడెం ప్రధాన కాలువలో చేపలు పడుతుండగా ఆంధ్రజ్యోతి కెమెరాలో బంధించింది.



తానిమడుగు శివారులో కడెం కాలువలో నీటి మడుగులో దోమ తెరతో చేపల వేట

చెన్నూరు ఆర్టీసీ డిపోకు నిధులు మంజూరు చేయాలి

- మందమర్రి బస్టాండ్‌కు అన్ని బస్సులు వచ్చేలా చూడాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిటౌన్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గంలో ఆర్టీసీడిపో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, నిధులు మంజూరు చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన నియోజకవర్గంలోని ఆయా బస్టాండ్లలో ప్రయాణికులకు నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా చెన్నూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీస్‌లను అందుబాటులోకి తేవాలన్నారు. నియోజకవర్గంలోని అటవీ ప్రాంతం కావడంతో రోడ్డు సౌకర్యం అభివృద్ధిచేసి మారుమూల గ్రామాల ప్రయాణికులకు సేవలందించాలని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో రోడ్లు బాగులేకపోతే మరమ్మతు చేయించినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ డిపో బస్సులు మందమర్రి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చేలా చూడాలని కోరారు. ఆర్టీసీకి ప్రయాణికుల రూపేనా ఆదాయం వస్తున్నందున రవాణా సౌకర్యాల పెంపుదలకు చొరవ చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.

మహిళలకు దీపాలంకరణ, ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

శ్రీరాంపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో భాగంగా మహిళలకు నస్పూర్‌కాలనీలోని సేవాభవన్‌లో దీపాలంకరణ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఏరియా సేవా అధ్యక్షురాలు మాలతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలను అభినందించారు. ఈ నెల 23న ప్రగతి మైదానంలో బహుమతులు అందిస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ పీవోలు కాంతారావు, శంతన్, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, న్యాయ నిర్ణేతలు హేమ, లత, అనురాధ, శారద, సునీత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల బాధితులకు న్యాయం చేయాలి



మంచిర్యాలలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, మందమర్రిలో వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): లగచర్ల బాధితులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. కొడంగల్‌లో రైతన్నలపై అక్రమ కేసులు బనాయించడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, జైల్లో నిర్బంధించడాన్ని నిరసిస్తూ ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, పేద దళిత, గిరిజనులు ఎన్నో తరాలుగా భూములు సాగు చేసుకుంటుంటే వారి నుంచి భూములు లాక్కొని హింసించడం, జైలుకు పంపడం తగదన్నారు. రైతులను వెంటనే విడుదల చేసి, వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేష్, నాయకులు రవీందర్ రెడ్డి, మల్లేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులపై దాడులు, అరాచకాలు పెరిగిపోయాయని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జె రవిందర్, రాజారమేష్, మేడిపెల్లి సంపత్‌లు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులపై పోలీసులతో ఉక్కుపాదం మోపుతున్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం కాలరాస్తున్నారన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములను తీసుకొని రోడ్డున పడేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. రాజశేఖర్, బడికెల సంపత్, ఎండి అబ్బాస్, తోట సురేందర్, బర్ల సదానందం, బోరిగం వెంకటేష్, రాయనర్సు పాల్గొన్నారు.

నెన్నెల, (ఆంధ్రజ్యోతి): లగచర్లలో రైతుల అక్రమ అరెస్టులను బీఆర్‌ఎస్ నాయకులు ఖండించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భం గా నాయకులు మాట్లాడారు. రైతులపై అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతులను జైళ్లలో పెట్టడం హేయమైన చర్య అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు విద్యా సాగర్‌గౌడ్, నాయకులు ఎండీ ఇబ్రహీం, ప్రతాప్‌రెడ్డి, మసూద్‌ఖాన్, షాకీర్, ప్రవీణ్ లౌణ్‌సింగ్, దురిశెట్టి రవీందర్ పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, ఉల్లాసం



వాలీబాల్ సర్వీస్ చేస్తూ క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సీఎం కప్-2024 క్రీడలను అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా యువజనుల క్రీడాశాఖ అధికారి కీర్తి రాజ్‌వీరుతో కలిసి జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ వరకు క్రీడా పోటీలు ఉంటాయని, ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయన షెడ్యూల్డ్ కులాల వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థుల గదులు, వంటశాల, భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ నెల 14న డైట్ చార్జీలను 40శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు చెప్పారు. నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు యాదయ్య, దుర్గా ప్రసాద్, రవీందర్ రెడ్డి, పురుషోత్తం నాయక్, రాజేశ్వరి, రౌఫ్‌ఖాన్, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేపల కోసం వల వేస్తే మొసలి పడింది...

హాజీపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : చేపల కోసం వల వేస్తే మొసలి పడిన సంఘటన రాపల్లి గ్రామంలో జరిగింది. గోదావరి తీరాన రాపల్లికి చెందిన మత్స్యకారుడు కూనారపు రామయ్య చేపల కోసం ఏర్పాటు చేసిన బుట్టలో మొసలి పిల్ల పడింది. వెంటనే స్థానికులతో కలిసి అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సునీతకు సమాచారం అందించారు. మొసలిని స్వాధీనం చేసుకొని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ నీటిలో విడిచిపెట్టారు. మొసలి బరువు ఆరు కిలోల వరకు ఉందని అధికారులు పేర్కొన్నారు.



మొసలిని వదిలిపెడుతున్న అటవీ అధికారి సునీత

గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు

తాండూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని రేచిని రోడ్డు - రేపల్లెవాడ రైల్వేస్టేషన్ల మధ్యలో గూడ్స్ రైలు బోగీలు విడిపోయాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న గూడ్స్ రైలు బోగీలు విడిపోయి కొద్ది దూరం వెళ్లిపోయింది. గమనించిన అధికారులు రైలును నిలిపివేశారు. రైలును వెనక్కి తీసుకువచ్చి విడిపోయిన బోగీలను లింక్ చేసి తీసుకెళ్లారు.

ఆకట్టుకున్న పడమటి సంధ్యారాగం



ఆకాశం స్వర్ణవర్ణ శోభితంగా మారిం ది. ఎంవీటీసీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో మంగళవారం సాయం కాలం భానుడి కిరణాలతో ఆ ప్రాంత మంతా కొత్తశోభను సంతరించుకుంది. పడమటి సంధ్యాకాంతులను వెదజల్లుతూ మెల్ల మెల్లగా బానుడు జారుకున్న దృశ్యాలు కను విందు చేశాయి. - మందమర్రిటౌన్

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంకల్ప ప్రతిజ్ఞ



కలెక్టరేట్ ఎదుట సామూహిక సంకల్ప ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం ఎనిమిదవ రోజుకు చేరింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు సామూహిక సంకల్ప ప్రతిజ్ఞ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులు తమను క్రమబద్ధీకరించాలని, రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన మరింతా ఉధృతం చేస్తామని ఎస్ఎస్ఏ-జేఏసీ జిల్లా అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు తెలిపారు. సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మెకు పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, కార్యదర్శి రాసపల్లి రవి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శాంకరిలు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.